సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 23 । జూలై । 2024



కూరగాయల ధర దడ

కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సామాన్యుల నెలవారీ బడ్జెట్‌పై ధరలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 8లో



మామిడికి గడ్డు రోజులు

ప్రపంచ స్థాయిలో పేర్గాంచిన నూజివీడు మామిడికి గడ్డు పరిస్థితి ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీబీ ప్రసాద్ అన్నారు. 8లో



ప్రకటన ఘనం.. ఆచరణ విఫలం

నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు విక్రయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా, ఆచరణలో అమలు జరగడం లేదని వినియోగదారులు అంటున్నారు. 8లో

న్యూస్‌రీల్

వరద ప్రాంతాల్లో జేసీ పర్యటన



వివరాలు తెలుసుకుంటున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

యలమంచిలి : మండలంలోని వరద ప్రభావిత కనకాయలంక, పెదలంక, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, లక్ష్మీపాలెం గ్రామాల్లో సోమవారం జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత అంబరీష్ పర్యటించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వరద ప్రభావిత గ్రామాల్లో మూడు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు నిల్వ చేశామన్నారు. ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటుచేశామన్నారు.


సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. వరద చుట్టుముట్టిన గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ప్రాణ, ఆస్తి, జంతు నష్టం జరగకుండా చూడాలన్నారు. గట్లు బలహీనంగా ఉన్నచోట చర్యలు చేపట్టాలన్నారు. బోట్లు, గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. దెబ్బతిన్న నారుమడులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆరా తీశారు. వాటర్ ప్యాకెట్లు సిద్ధం చేయాలని, పాము, కుక్క, తేలు కాటు మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వరదను అధికారులంతా సమర్థంగా ఎదుర్కోవాలన్నారు. డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల నిర్మాణాలు వేగిరపర్చాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ప్రభుత్వాస్పత్రుల నిర్మాణాలను వేగిరపర్చాలని, ముఖ్యంగా పాలకొల్లు ప్రభుత్వాస్పత్రి నిర్మాణాన్ని వచ్చేనెల 5 నాటికి నూరుశాతం పూర్తిచేసి అందజేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పాలకొల్లు, ఆకివీడు ఆస్పత్రుల నిర్మాణాలపై ఆమె సమీక్షించారు. ఆకివీడు ఆస్పత్రిని కూడా త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ మేరకు ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాము, కుక్క, తేలు కాటుల మందుల లభ్యతపై డీసీహెచ్‌ఎస్‌ను ఆరా తీశారు. పాలకొల్లులో ఆస్పత్రికి ఇమ్మడి సత్యనారాయణ ఎంత స్థలాన్ని దానంగా ఇచ్చారు, ఎంత స్థలంలో నిర్మాణాలు జరిగాయి తదితర అంశాలతో నివేదికను అందించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

భీమవరం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 10 మంది ఫిర్యాదులు అందజేశారు. ఆయా సమస్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలన్నారు. స్థానికంగా ఉండే పోలీస్‌స్టేషన్లు, సర్కిళ్లు, సబ్ డివిజన్ కార్యాలయాల్లోనూ ఫిర్యాదు చేయవచ్చన్నారు.

హౌసింగ్ పీడీ సరెండర్

ఏలూరు(మెట్రో): జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీఎస్‌ఆర్ రవికుమార్‌ని సరెండర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్‌కి రిపోర్ట్ చేయాలని జిల్లా ఉన్నతాధికారులు తెలిపినట్టు సమాచారం. రవికుమార్ గతంలో జిల్లాపరిషత్ సీఈఓగా పనిచేశారు. ఆ సమయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. జిల్లా పీడీగా జంగారెడ్డిగూడెం డివిజన్ హౌసింగ్ ఈఈ ఎ.శ్రీనివాసరావుకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

ఉధృతంగా గోదావరి



కనకాయలంకలో వరద నీటిలోనే నిత్యావసర సరుకులు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

వడివడి.. అలజడి

- **ధవళేశ్వరం వద్ద ఒకటో ప్రమాద హెచ్చరిక**
- **వశిష్ట గోదావరిని ముంచెత్తుతున్న వరద నీరు**
- జిల్లాలో 60 కిలోమీటర్ల మేర ఏటిగట్టు
- 33 లంక గ్రామాలకు ముంపు
- కనకాయలంకకు పడవల ద్వారా రాకపోకలు
- పొంగుతున్న ఎర్రకాలువ, వయ్యేరు కాలువ, యనమదుర్రు డ్రెయిన్
- పునరావాస ఏర్పాట్లలో అధికారులు



యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వే వద్ద పడవల్లో రాకపోకలు



కనకాయలంక కాజ్‌వే పై నుంచి వరద గోదావరి



యండగండిలో వృద్ధురాలి అవస్థలు



తణుకు మండలం దువ్వలో రహదారిపైకి చేరిన వయ్యేరు వరద నీరు



పాలకోడేరు మండలం మోగల్లు శివారులో గోస్తనీ డ్రెయిన్‌కు గండి పడిన దృశ్యం



తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ల వద్ద ఎర్ర కాలువకు గండి కొట్టిన దృశ్యం



ఉండి అక్విడెక్ట్ వద్ద గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సాక్షి, భీమవరం: వశిష్ట గోదావరికి వరద వడి పెరుగుతోంది. ఎగువ నుంచి ఉరకలెత్తుతూ వస్తున్న జలాలతో ఉధృతి గంటగంటకూ అధికమవుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఒకటో ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో జిల్లాలోని లంక గ్రామాలకు ముంపు ముప్పు పొంచి ఉంది. కనకాయలంక కాజ్‌వే నీట మునగ్గా పడవల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. మరోపక్క జిల్లాలోని ఎర్రకాలువ, యనమదుర్రు, గోస్తనీ డ్రెయిన్ గట్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తూ సమీప ప్రాంతాలను ముంచెత్తుతోంది.

60 కిలోమీటర్ల మేర ఏటిగట్టు

జిల్లాలోని ఆచంట మండలం దొంగరావిపాలెం నుంచి నరసాపురం రూరల్ బియ్యపుతిప్ప వరకు 60 కిలోమీటర్లు పొడవున వశిష్ట గోదావరి కుడి ఏటిగట్టు విస్తరించి ఉంది. ప్రస్తుతం ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఉధృతమవుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి నీటిమట్టం 13 అడుగులకు చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. 11.7 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద వరద తాకిడి ఎక్కువగా ఉండటంతో సోమవారం అర్ధరాత్రి లేదా మంగళవారం ఉదయం నాటికి నీటిమట్టం 13.75 అడుగులకు చేరుకుని రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉందని జలవనరులశాఖ అధికారులు భావిస్తున్నారు. వరద తీవ్రతను బట్టి గోదావరి తీరం వెంబడి ఉన్న ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాల పరిధిలోని 33 వరకు లంక గ్రామాలు, నరసాపురం పట్టణంలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటాయి.

కనకాయలంకలో..

యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వే నీట మునగడంతో అధికారులు ఏర్పాటుచేసిన పడవల ద్వారా గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. వరద తీవ్రతను బట్టి పునరావాస కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆచంట మండలంలోని లంక భూముల్లోని అరటి తోటలను వరద నీరు ముంచెత్తింది. ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయితే లంక గ్రామాలను వరద నీరు చుట్టుముడుతుంది.

ముంచుతున్న ఎర్ర కాలువ

ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం వద్ద ఎర్రకాలువ గట్టుపై నుంచి పొంగి ప్రవహిస్తున్న వరద నీటితో తణుకు మండలంలోని తేతలి, దువ్వ గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. దువ్వ–సూర్యారావుపాలెం, దువ్వ–వరిఘేడు రహదారిపై వరద నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. దువ్వ వద్ద వరద నీరు అక్విడెక్టును తాకుతూ ప్రవహిస్తుండగా గతంలో ఎప్పుడు ఇంత ఉధృతి చూడలేదని స్థానికులు అంటున్నారు. పెంటపాడు మండలం బి.కొండేపాడు, మీనవల్లూరు, యానలపల్లి, పరిమెళ్ల, పడమరవిప్పర్రు గ్రామాల్లో పంట పొలాలు మూడు రోజులుగా ముంపులోనే ఉన్నాయి. యనమదుర్రు డ్రెయిన్ ఉధృతితో భీమవరంలోని 39వ వార్డు దుర్గాపురం, 38వ వార్డు లంక పేట, 1వ వార్డు మెంటేవారితోట, 22వ వార్డు చేపల మార్కెట్ ప్రాంతాలు నీట మునిగాయి. పాలకోడేరు మండలం మోగల్లు వద్ద గోస్తనీ డ్రెయిన్‌కు ఆదివారం రాత్రి గండిపడటంతో గుత్తులవారిపాలెం, ఎస్టీ కాలనీలు నీట మునిగాయి.

యండగండికి వరద పోటు

ఉండి: ఉండి కాలువ యండగండి గ్రామాన్ని ముంచెత్తుతోంది. సోమవారం గ్రామంలోని తిమ్మరాజు కాలనీలోకి వరద నీరు చేరింది. గ్రామానికి ఓవైపు ఉండి కాలువ, మరోవైపు యనమదుర్రు మేజర్ డ్రెయిన్ ఉండటంతో వరద నీరు ముందుకు పారక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లల్లో చేరిన వరద నీటిని ప్రజలే తోడుకుంటున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

శిథిలావస్థలో చినమామిడిపల్లి లాకులు

నరసాపురంలోని పాలకొల్లు రోడ్డులో గోదావరి వద్ద లాకులు శిథిలావస్థకు చేరడంతో వరద నీరు ఎగదన్నుతోంది. ఇక్కడ లాకులు బద్దలైతే పట్టణంలోని చినమామిడిపల్లి మొదలు సరిపల్లి, లిఖితపూడి వరకూ గ్రామాలు నిమిషాల వ్యవధిలో నీట మునిగే ప్రమాదం ఉంది. అయితే ఈ విషయంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. వరద ఉధృతితో మాధవాయిపాలెం గోదావరి రేవులో పంటు రాకపోకలు రెండో రోజు సోమవారం కూడా నిలిపివేశారు.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పరిశీలన



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పాలకోడేరు: గోస్తనీ నది గండితో ముంపునకు గురైన మోగల్లులోని గుత్తులవారి పాలెం ఎస్టీ కాలనీలో కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం పర్యటించారు. గండి పడిన ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలనీవాసుల సమస్యలు తెలుసుకుని వెంటనే తాగునీరు అందించాలని అధికారులకు ఆదేశించారు. పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆర్డీఓ బి.శ్రీనివాసులు రాజు, ఎంపీడీఓ టి.అనూహ్య ఉన్నారు.

నరసాపురం.. ముంపు భయం



నరసాపురం: నరసాపురం వశిష్ట గోదావరి ఉగ్రరూపం దాల్చింది. సోమవారం నీటిమట్టం భారీగా పెరగడంతో పొన్నపల్లి, మాధవాయిపాలెం, లాకుపేట ప్రాంతాల వాసులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మండలంలోని నవరసపురం, పాతనవరసపురం ప్రాంతాలకు ముంపు ముప్పు పొంచి ఉంది. ముంపు ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ఆర్డీఓ ఎం. అచ్యుత్ అంబరీష్ సూచించారు.

రైతులను వెంటనే ఆదుకోవాలి

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



వల్లూరుపల్లిలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: జిల్లాలో భారీ వర్షాలతో ఎర్రకాలువ, డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయని, దీంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదే అని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని దర్శిపర్రు, వల్లూరుపల్లి, రావిపాడు, కొండేపాడు, మీనవిల్లూరు, రామచంద్రపురం, కోరిమిల్లి, చింతపల్లి, ఆకుతీగపాడు, కె.పెంటపాడు, యానాలపల్లి, పరిమెళ్ల గ్రామాల్లో ఆయన పర్యటించి ముంపు బారిన పడిన చేలను పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. నెల రోజుల క్రితం వేసిన నాట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఒక్కో ఎకరాకు రూ.10 వేల వరకు పెట్టుబడులు పెట్టారన్నారు. ఈ సమయంలో రైతులకు ధైర్యం చెప్పేలా సరైన ప్రకటన చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం ఆ ప్రయత్నం చేయకపోవడం విచారకరమన్నారు. గత జగన్ ప్రభుత్వంలో విపత్తుల సమయంలో అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు నష్ట అంచనాలు త్వరితగతిన చేయించి ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇవన్నీ పట్టించుకోకుండా వైఎస్సార్ సీపీపై అభాండాలు వేయడం సరికాదన్నారు. రైతులకు వెంటనే నారు, విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు ఎకరాకు రూ.5 వేలు సాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

పట్టాలెక్కని కోటిపల్లి రైల్వే లైన్

- నరసాపురం–కోటిపల్లి లైనుకు అరకొర కేటాయింపులు
- మందకొడిగా సాగుతున్న పనులు
- 2019 నుంచి బడ్జెట్‌లో నామమాత్రంగా నిధులు
- నేటి కేంద్ర బడ్జెట్‌పై ఆశలు



నరసాపురంలో రైల్వేస్టేషన్



యలమంచిలి మండలం చించినాడలో గోదావరిపై రైలు వంతెన నిర్మాణ పనులు

నరసాపురం: కోనసీమ, డెల్టా వాసుల దశాబ్దాల కలగా ఉన్న నరసాపురం–కోటిపల్లి రైల్వేలైన్ పట్టాలెక్కడం లేదు. భారీ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా నిధులు విడుదల చేయడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత బడ్జెట్‌లో రూ.430 కోట్ల నిధులు కేటాయించినా పనులు పరుగులెత్తడం లేదు. రూ.2,800 కోట్ల అంచనా వ్యయంతో భారీ ప్రాజెక్టు చేపట్టినా కేటాయింపులు మాత్రం అరకొరగానే ఉంటున్నాయి. మంగళవారం కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న తరుణంలో ఈసారైనా భారీగా నిధులు కేటాయింపులు ఉండాలని ఉభయ గోదావరి జిల్లావాసులు కోరుతున్నారు.

గోదావరి పాయలపై మూడు వంతెనలు

కోటిపల్లి రైల్వేలైన్ ప్రాజెక్టుకు సంబంధించి గోదావరిపై మూడు పాయల వద్ద వంతెలు నిర్మించాలి. ఇందుకు రూ.700 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. అయితే అంతంతమాత్రం కేటాయింపులతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. మరోవైపు స్థల సేకరణ కూడా పూర్తిస్థాయిలో జరగలేదు. 2001లో రైల్వేలైన్ నిర్మాణం ఆలోచన ఊపందుకున్న తర్వాత 2019 నుంచి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నారు. అంతకు ముందు మరో రెండు బడ్జెట్‌ల్లో నిధులు కేటాయించినా విడుదల కాలేదు.

కేటాయింపులతో సరి!

మచిలీపట్నం–గుడివాడ–భీమవరం వరకూ ఉన్న రైల్వేలైన్‌ను 1925లో నరసాపురం వరకు పొడిగించారు. తర్వాత కాలంలో నరసాపురం నుంచి కోనసీమకు రైల్వేలైన్ అనుసంధానం కావాలనే డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రూ.64 కోట్లతో రైల్వేలైన్ పూర్తిచేశారు. అప్పటి నుంచి కోటిపల్లి నుంచి నరసాపురం వరకు రైల్వేలైన్ పొడిగించాలనే డిమాండ్ ఊపందుకుంది. 2001–02 బడ్జెట్‌లో తొలిసారిగా రూ.100 కోట్లు కేటాయించినా నిధులు విడుదల కాలేదు. 2016–17 బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించినా సర్వేకే నిధులు సరిపోని పరిస్థితి. ఇక 2019 నుంచి వరుసగా నిధులు కేటాయిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు రూ.1,900 కోట్ల నిధులు కేటాయించినా పూర్తిస్థాయిలో సొమ్ములు విడుదల కాలేదు. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో ప్రాజెక్టు నిర్మాణమవుతోంది. 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. ఇదిలా ఉండగా వంతెన నిర్మాణాలకే అధిక మొత్తంలో వెచ్చించాల్సి ఉంది. వైనతేయ, గౌతమి, వశిష్ట నదులపై వంతెనల నిర్మాణాలు జరుగుతున్నాయి.

స్థల సేకరణలో ఇబ్బందులు

నిధులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో స్థల సేకరణ కూడా పెండింగ్‌లోనే ఉంది. మొత్తం 54 కిలోమీటర్ల పొడవులో నిర్మించే రైల్వే లైన్ కోసం దాదాపు 200 ఎకరాల భూమి సేకరించాలి. తొలి దశ కింద 158.55 ఎకరాలు సేకరించారు. తూర్పుగోదావరి జిల్లాలో భట్లపాలెం, కామనగరువు ప్రాంతాలు, అమలాపురం మండలంలో భట్నవిల్లి, రోళ్లపాలెం, భట్లపాలెం, పేరూరు పరిధిలో భూసేకరణ కాస్త మెరుగ్గా జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి, నరసాపురం ప్రాంతాల్లో భూసేకరణ కొంత మేర పెండింగ్‌లో ఉంది. ఇప్పటికీ బాధితులకు నష్టపరిహారం చెల్లించలేదు.

37 వేల హెక్టార్లలో పంటలకు నష్టం

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలో భారీ వర్షాలు, వరదలకు 37 వేల హెక్టార్లకు పైగా పంటలు దెబ్బతిన్నాయని కలెక్టర్ నాగరాణి తెలిపారు. ఏడు మండలాల్లోని 43 గ్రామాలు తాకిడికి గురయ్యాయని, 8 గ్రామాల్లోకి వరద నీరు చొచ్చుకు వచ్చిందన్నారు. మూడు పట్టణ ప్రాంతాలు ముఖ్యంగా భీమవరంలోని కొన్ని ప్రాంతాల్లో వరద నీరు చొరబడిందన్నారు. 20 మండలాల్లోని 37,182 హెక్టార్లలో వరి నారుమడులు, నాట్లు దెబ్బతినగా సుమారు రూ.41.52 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. అలాగే 614 మంది రైతులు సాగు చేస్తున్న 154.46 హెక్టార్ల ఉద్యాన పంటలు ముంపు బారినపడ్డాయని, దీని ద్వారా రూ.4.06 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. జిల్లాలో 14 ఇళ్లు దెబ్బతినగా, ఏడు ఇళ్లు పాక్షికంగా, నాలుగు పూరిళ్లు దెబ్బతిన్నాయన్నారు. 161 కుటుంబాల్లోని 424 మందిని పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. 66 ఆర్‌అండ్‌బీ రోడ్లు 179.820 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయని, వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ.12.88 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.144.60 కోట్ల అంచనా వ్యయం కాగలదన్నారు. అలాగే 274.27 కిలోమీటర్ల పరిధిలోని 105 పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయని వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ.1.30 కోట్లు, శాశ్వత నిర్మాణానికి రూ.85.70 కోట్లు అంచనా వ్యయం అవుతుందని కలెక్టర్ నాగరాణి వివరించారు.

క్లుప్తంగా

చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయికి జైలుశిక్ష, జరిమానా

నూజివీడు: చెల్లని చెక్కు కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి సోమవారం తీర్పుచెప్పారు. నూజివీడు మండలం రామన్నగూడెంకు చెందిన శీలం వెంకటేశ్వరరావు విజయవాడకు చెందిన కరికేటి పాల్‌తిమోతీకి ఫిబ్రవరి 2020లో రూ.7 లక్షలు నగదు అప్పుగా ఇచ్చాడు. కొద్ది కాలం తరువాత వెంకటేశ్వరరావు బాకీ తీర్చమని తిమోతీని అడుగగా 2021 మార్చి 3వ తేదీన రూ.7.50 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును నగదు వసూలు నిమిత్తం వెంకటేశ్వరరావు బ్యాంకులో వేయగా ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. దీనిపై వెంకటేశ్వరరావు కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం కరికేటి పాల్ తిమోతీకి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ స్పెషల్ మేజిస్ట్రేట్ తీర్పును వెలువరించారు.

యూనియన్ బ్యాంక్ వృద్ధిరేటు లక్ష్యం 20 శాతం



లబ్ధిదారునికి కారు కీ అందిస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

తాడేపల్లిగూడెం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 64 శాఖల ద్వారా రూ.825 కోట్ల వ్యాపారం చేశామని ఆ బ్యాంక్ ఏలూరు రీజినల్ హెడ్ నాంపల్లి శ్రీనివాసు తెలిపారు. పట్టణంలోని యూనియన్ బ్యాంకు శాఖలో సోమవారం ఏర్పాటుచేసిన రిటైల్ ఎక్స్‌పోలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వృద్ధిరేటు 20 శాతం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. బ్యాంకు ద్వారా 8.35 శాతం వడ్డీతో గృహ రుణాలను అందజేస్తున్నామన్నారు. వాహన రుణాలను 8.70 శాతం వడ్డీతో మంజూరు చేస్తున్నామన్నారు. విదేశీ విద్యారుణాలను రూ.కోటి 50 లక్షల వరకు ఇస్తున్నామన్నారు. యూనియన్ సోలార్ రూఫ్‌టాప్ పథకం కింద మూడు కిలో వాట్స్ వరకు రూ.78 వేల సబ్సిడీతో ఏడుశాతం వడ్డీతో రుణ సదుపాయం ఉందన్నారు. ఆర్‌ఎల్‌పీ హెడ్ బి.హనుమంతరావు, గూడెం చీఫ్ మేనేజర్ ప్రదీప్ మల్లిక్, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

యాసిడ్ తాగి మహిళ మృతి

భీమవరం: మతిస్థిమితంలేని మహిళ యాసిడ్ తాగి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం వెంకటేశ్వరరావు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు మండలం జగ్గన్నపేటకు చెందిన జి.అరుణవతి(57) కుటుంబంతో కలసి పట్టణంలోని మెంటేవారితోటలో నివాసముంటున్నారు. ఆమె మానసికస్థితి సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు వైద్యం చేయిస్తున్నారు. సోమవారం మరుగుదొడ్లు క్లీనింగ్‌కు ఉపయోగించే యాసిడ్‌ను ఆమె తాగడంతో వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందడంతో ఆమె కుమారుడు ఏసురాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కూరగాయల 'ధర' దడ

- పెరుగుతున్న కూరగాయల ధరలు
- నిత్యావసరాలదీ అదే దారి..
- నెలవారీ బడ్జెట్‌పై పెను ప్రభావం



ఏలూరు నగరంలోని ఓ కూరగాయల దుకాణం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వేళకు స్నానంబు.. వేడివేడి భోజనంబు.., కూటి కోసం కోటి విద్యలు.. తిండి కలిగితే కండగలదోయ్.. కండ కలవాడే మనిషోయ్.. తెలుగు గడ్డపై ప్రాచుర్యంలో ఉన్న సామెతలు. అంటే మనిషి ఆహారానికి ఎంతటి ప్రాధాన్యత ఉందో ఈ సామెతలు చెబుతాయి. పేదవాడైనా, ధనికుడైనా నిత్యం కడుపుకు పట్టెడన్నం తినాల్సిందే. ఆరోగ్యం కాపాడుకోవడానికి, పనిచేసినా తగిన శక్తి కావాలంటే ఆహారమే మనిషికి ప్రధానం. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో వంటింట్లో ధరల తుపాను కొనసాగుతోంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలు ఇటు కూరగాయలు, అటు నిత్యావసర వస్తువుల ధరల బారిన పడి కుదేలౌతున్నారు. భోజనంలోకి మంచి కూరగాయ కూర వండుకోవాలని కూరగాయలు కొనుక్కుందామంటే వాటి ధరలు చూసి గుండెలు గుభేలుమంటున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా కూరగాయల ధరలు రెండు నెలల కాలంలో రెట్టింపై నెలవారీ బడ్జెట్‌పై పెను ప్రభావం చూపుతున్నాయి.

కూరగాయల ధరలు రెట్టింపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. అప్పటి వరకూ కూరగాయలు కిలో రూ. 20- 30 మధ్యలో ఉండగా ప్రస్తుతం వాటి ధరలు దాదాపు రెట్టింపయ్యాయి. అంటే ఇప్పుడు ఏ కూరగాయ చూసినా కిలో రూ. 40 – 60 మధ్యలో ఉంటోంది. ముఖ్యంగా ప్రతి కూరకూ ప్రధానంగా కావాల్సిన ఉల్లిపాయల ధర గత మే నెలలో కిలో రూ. 24 నుంచి 28 మధ్యలో ఉండగా ప్రస్తుతం రూ. 40కి చేరుకుంది. మే నెలకు ముందు ఒకదశలో ఆటోల్లో ఇంటింటికీ వచ్చి 6 కిలోల ఉల్లిపాయలు రూ.100కు విక్రయించిన సందర్భాలూ ఉన్నాయి. ప్రస్తుతం రూ.100 పెడితే రెండున్నర కిలోలు మాత్రమే వస్తున్నాయి.

గతంలో వేసవిలో సైతం తక్కువ రేట్లే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నడి వేసవిలో పంటలకు నీరు దొరకని సమయంలో సైతం ధరలు నియంత్రణలోనే ఉండేవి. గత మే నెల 1వ తేదీన రైతు బజారు ధరలు ఇలా ఉన్నాయి. టమాటాలు రూ.26, వంకాయలు రూ. 16, బెండకాయలు రూ. 24, పచ్చిమిర్చి రూ.48, కాకరకాయలు రూ. 34 బీరకాయలు రూ. 28- 38, బంగాళదుంపలు రూ.32, ఉల్లిపాయలు రూ.24 గోరుచిక్కుడు రూ.40, దోసకాయలు రూ. 20గా ఉన్నాయి.

ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్న ధరలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ ప్రభుత్వం దళారులకు అండగా నిలుస్తుండడంతో పెత్తనమంతా వారిదే అవుతోంది. దళారులు చెప్పిందే ధరగా రైతుబజారుల్లో కూరగాయల్లో విక్రయాలు జరుగుతున్నాయి. సోమవారం రైతు బజారులో ధరలు చూస్తే ఈ విషయాన్ని సామాన్యుడు కూడా అర్థం చేసుకోగలడు. సోమవారం ఏలూరు రైతు బజారుల్లో టమాటా రూ.54, వంకాయలు రూ. 32, బెండకాయలు రూ.30 పచ్చిమిర్చి రూ.48, కాకర కాయలు రూ. 44- 54, బీరకాయలు రూ. 24 – 36, బంగాళదుంపలు రూ.40, ఉల్లిపాయలు రూ.40, గోరుచిక్కుడు కాయలు రూ.48, దోసకాయలు రూ.24 ఇలా ప్రజలు ఎక్కువగా వాడే కూరగాయల ధరలన్నీ పైపైకి వెళుతున్నాయే తప్ప కిందకి దిగిరావడం లేదు.

బియ్యం, పప్పు దినుసులకూ రెక్కలు

కాగా నిత్యావసరాలదీ కూరగాల దారే అయింది. బియ్యం, పప్పు దినుసుల ధరలకు రెక్కలు వచ్చాయి. రూ. 100 నుంచి రూ. 150 మధ్యలో ఉండే మినపప్పు, కందిపప్పు, పెసరపప్పు, శనగపప్పు వంటి పప్పు దినుసుల ధరలు ప్రస్తుతం రూ.120 నుంచి 180 మధ్య విక్రయిస్తున్నారు. ఈ ధరలను నియంత్రించలేక ప్రభుత్వమే దిగిరావాల్సి వచ్చింది. ప్రజల వ్యతిరేకత నుంచి బయటపడడానికి రైతు బజారుల్లో ప్రత్యేక కౌంటర్లు పెట్టి కంది పప్పును రూ.160కి, బియ్యాన్ని రూ.48, 49లకు విక్రయించాల్సిన పరిస్థితి కూటమి ప్రభుత్వానికి ఏర్పడింది.

కొనాలంటే ఆలోచించాల్సిందే..



అంతంతమాత్రం ఆదాయం ఉండే మాలాంటి కుటుంబాలకు కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయంటే పిడుగుపడినట్టే ఉంటుంది. కూరగాయలు కొనాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇంటి వద్ద ఆటోలో వచ్చి వంద రూపాయలకే 4 నుంచి 6 కేజీల ఉల్లిపాయలు ఇచ్చేవారు. ఇప్పుడు కేజీ రూ.40 అయింది.

– గొంతిన ఝాన్సీలక్ష్మి, ప్రైవేట్ ఉపాధ్యాయురాలు

టమాటా కొనలేం



ఇతర కూరగాయలతో టమాటా కలిపి వండితే మంచి రుచి వస్తుంది. ఇంటిలో అందరూ ఇష్టంగా తినే కూరగాయాల్లో టమాటా ఒకటి. అలాంటి టమాటా కూర తిని సుమారు రెండు నెలలకు పైనే అవుతోంది. గతంలో కిలో రూ.20 ఉండే టమాటా ఇప్పుడు 60 రూపాయలు. అంత ధర పెట్టి టమాటా కొనలేక పోతున్నాం.

– ముమ్మిన గిరిజ, గృహిణి

ధరలు తగ్గించాలి



పంట పండకపోవడమో, దిగుబడి లేకో, వాతావరణ ప్రభావం వలనో ధరలు పెరుగుతుంటాయి. అటువంటి సందర్భాల్లో ఆయా కూరగాయల ధరలు పెరుగుతుండడం సహజం. కానీ ప్రస్తుతం అన్ని కూరగాయల ధరలూ పెరిగి మాలాంటి సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం కూరగాయల ధరలను తగ్గించాలి.

– రెళ్ల శారద, టైలర్

రొయ్యల సాగులో జాగ్రత్తలు పాటించాలి



రొయ్యలు

తాడేపల్లిగూడెం: వర్షాకాలంలో రొయ్యల సాగులో రైతులు సరైన జాగ్రత్తలు తీసుకుంటే నష్టాలను నివారించవచ్చని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దేవీవరప్రసాదరెడ్డి చెప్పారు. వాతావరణంలో ఉన్న ఉష్ణోగ్రతలను బట్టి రొయ్యల్లో శరీర ఉష్ణోగ్రత కూడా మారుతుంది. వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గడం వల్ల వాటి ఆహారం తీసుకొనే శక్తి కూడా తగ్గుతుంది. ఇలాంటి సమయాల్లో మేత చెక్‌ట్రేలను ఎప్పటికప్పుడు గమనించుకోవాలి. పది నుంచి 20 శాతం మేతను తగ్గించుకున్నట్టయ్యితే ఖర్చులు కూడా తగ్గుతాయి. మేత వృథా కావడం వల్ల చెరువులో అమ్మోనియా, నైట్రేట్ వంటి విష వాయువులు ఏర్పడి రొయ్యలు చనిపోయే ప్రమాదముంది. అలాగే చెరువుల అడుగుభాగంలో హైడ్రోజన్ సల్ఫైడ్ వంటి విషవాయువులు ఏర్పడే ప్రమాదముంది. కాబట్టి నీటి గుణగణాలు పరీక్ష చేయించి, తగిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వర్షపునీటిలో ఉదజని ఎలా ఉందనేది ఉదజని సూచిక ద్వారా చూసుకొని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రాణవాయువులో మార్పు రావడం వల్ల కూడా రొయ్యలు చనిపోతాయి. నీటిలో ఉన్న ఆక్సిజన్ శాతం వర్షం పడిన తర్వాత తగ్గుతుంది. చెరువులోని రొయ్యలు, జీవులు, జీవరాశులు, డి కంపోజింగ్ బ్యాక్టీరియా ప్లాంక్టన్, పాటోసింథసిస్ జరగకపోవడం వల్ల ఎక్కువ ఆక్సిజన్ కావాల్సి ఉంటుంది. ఈ సందర్భంలో ఏరియేటర్స్ వాడాలి. పీహెచ్ శాతం తగ్గకుండా సున్నాన్ని, అగ్రికల్చర్ లైమ్‌ను వాడితే సరిపోతుందని శాస్త్రవేత్త దేవీవరప్రసాదరెడ్డి తెలిపారు. ఈ జాగ్రత్తలు తీసుకుంటే రొయ్యల సాగులో నష్టాలను నివారించుకోవచ్చన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆదాయం



నాబార్డు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యాన వర్సిటీ డీన్ పద్మావతమ్మ

తాడేపల్లిగూడెం: పండ్లు, కూరగాయల్లో వివిధ విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేసుకొని స్వయం సమృద్ధి సాధించాలని ఉద్యాన వర్సిటీ డీన్ ఎస్.పద్మావతమ్మ కోరారు. నాబార్డు సహకారంతో వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయ కళాశాలలో మహిళలకు ఏర్పాటు చేసిన శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మావతమ్మ మాట్లాడుతూ పూలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడంలో స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి ఆదాయం పొందాలని కోరారు. పువ్వులు, కూరగాయలు, పండ్లతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేసుకొని జీవన ప్రమాణాలను పెంచుకోవాలన్నారు. నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి టి.అనిల్‌కాంత్ మాట్లాడుతూ నాబార్డు, ప్రభుత్వం నుంచి చాలా పథకాలు ప్రోసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు మార్కెటింగ్ చేసుకోడానికి ఉన్నాయన్నారు. పండ్లు, కూరగాయలతో జాం.స్క్వాష్, నెక్టర్, మురబ్బా పొడుల తయారీలను ఆదాయ మార్గంగా వినియోగించడంపై విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ వివరించారు. ఈ శిక్షణ 15 రోజులపాటు జరుగనుంది. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వి.దీప్తి, ఏ.దేవీవరప్రసాదరెడ్డి, ఎం.రాఘవేంద్రరెడ్డి, కె.వెంకటసతీష్ మాట్లాడారు. మాస్టర్ ట్రైనర్స్‌గా సత్యవతి, దివ్యజ్యోతి, వాణి.శ్రీలక్ష్మి, లలిత. ప్రసన్న, శోభ వ్యవహరించారు.

ప్రకటన ఘనం.. ఆచరణలో విఫలం

హబ్‌లో నిండుకున్న బియ్యం, కందిపప్పు



స్థానిక రిలయన్స్ హబ్‌లో నిండుకున్న బియ్యం

ఆకివీడు: నాణ్యమైన బియ్యంను సరసమైన ధరలకు విక్రయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా, ఆచరణలో అమలు జరగడంలేదని వినియోగదారులు వాపోతున్నారు. స్థానిక మాదివాడ సెంటర్‌లోని రిలయన్స్ హబ్‌లో స్వర్ణ బియ్యం కిలో రూ.47కు స్టీమ్ సోనామసూరు బియ్యం రూ.48కు, కందిపప్పు కిలో రూ.160కు విక్రయించే విధంగా స్టాల్ ఏర్పాటు చేశామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే స్థానిక హబ్‌లో మాత్రం నాణ్యమైన బియ్యం విక్రయించడంలేదని, కంది పప్పు స్టాకు లేదని, ప్రైవేటు మార్కెట్ ధర రూ.180కు విక్రయిస్తున్నారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కందిపప్పు ప్రభుత్వ సరఫరా రాలేదని చెబుతున్నారు. స్వర్ణ బియ్యం కాకుండా మరో రకం బియ్యంను విక్రయిస్తున్నారు. సోనామసూరు బియ్యం కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. హబ్‌లో బియ్యం కేవలం ఐదారు కేజీలు మాత్రమే ఉండటంతో వినియోగదారులకు కేజీ మాత్రమే విక్రయిస్తామని చెబుతున్నారు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కనిపించని స్టాల్

స్థానిక రిలయన్స్ హబ్‌లో ప్రభుత్వ దుకాణం కనిపించడం లేదు. రేషన్ బియ్యం ఉన్నాయా అని అడిగితే హబ్ సేల్స్‌మెన్‌లు సరైన సమాధానమే ఇవ్వడంలేదని పలువురు వాపోతున్నారు. లోపలకు వెళ్లి వెదికితే ఎక్కడో కనిపించని విధంగా రేషన్ బియ్యం ఉంచారు. అవి కూడా నాలుగైదు కేజీలు మాత్రమే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిలయన్స్ హబ్‌లో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి రేషన్ బియ్యం, కందిపప్పు విక్రయించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వరిని వివరణ కోరగా రిలయన్స్ హబ్‌లో స్టాక్ అయిపోయిందని, కందిపప్పు, బియ్యం వస్తున్నాయని మేనేజర్ చెప్పారని ఆమె తెలిపారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



విద్యుత్ మీటర్ రీడర్ల జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

ఏలూరు (టూటౌన్): విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్ల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సమావేశం స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్ నందు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో మీటర్ రీడర్స్‌కు పీస్ రేట్ సక్రమంగా కాంట్రాక్టర్లు చెల్లించడం లేదని, అలాగే జీతాల్లో సైతం కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. మీటర్ రీడర్లందరూ ఐకమత్యంతో పోరాడాలని ఆయన కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే మాట్లాడుతూ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీస్‌రేట్ రద్దు చేయాలని, మీటర్ రీడర్లలో ఐటీఐ చదివిన వారికి ఆపరేటర్‌గా, నాన్ ఐటీఐ వారికి విద్యార్హతను బట్టి వారికి విద్యుత్ సంస్థలోనే ఉద్యోగం కల్పించాలన్నారు. మార్చి నెలలో ఇచ్చిన ఎస్క్రో అకౌంట్, మినిట్స్‌ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మీటర్ రీడర్ల సంఘానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఓ.శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హుండీలో నగదు చోరీ

ద్వారకాతిరుమల: దేవస్థానం ఆళ్వార్ సదనం ఎదురుగా ఉన్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఇనుప రాడ్లతో ఆలయం గేటు తాళాలను పగులగొట్టి లోపలికి వెళ్లి అనంతరం హుండీని పగలగొట్టి నగదును తస్కరించారు. సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లిన కమిటీ సభ్యులు అంబటి గాంధి చోరీ జరిగినట్టు గుర్తించి ఆ విషయాన్ని మిగిలిన సభ్యులతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు, స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆలయం పక్కనున్న పొదల్లో దుండగులు ఉపయోగించిన ఇనుప రాడ్లను గుర్తించారు. చోరీ సొమ్ము సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రమాదాలను నివారిద్దామని విద్యుత్ వినియోగదారులకు ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పీ సాల్మన్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. భారీ వర్షాలు, గాలులు ఉన్నపుడు ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుపాను సమయంలో ఇంటి గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్ మోడ్లో ఉంచాలని, ఇంటి లోపల కరెంటు స్విచ్ బోర్డులో స్విచ్‌లను తడి చేతులతో ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువులను తాకనీయరాదని, ఇంటి సర్వీసు వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదన్నారు. కరెంటు పోల్స్ పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం లేదా కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. మోటార్ల స్టార్టర్లు, మోటార్లు వర్షం వల్ల నీటిలో మునగడం, పూర్తిగా తడవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదముందని, రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యుత్ సమస్యలను టోల్ ఫ్రీ నెంబరు 1912కు తెలియజేయాలన్నారు.

పంట కాలువ తలుపులు ధ్వంసం



దిప్పకాయలపాడు రాజు చెరువు తలుపు ధ్వంసం చేయడంతో నీరు వృథాగా పోతున్న దృశ్యం

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు రాజు చెరువు పంట కాలువ తలుపును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో చెరువులో నీరు వృథాగా పోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సమృద్ధిగా చెరువులో నీరు చేరడంతో రాజు చెరువు నుంచి గోపాలపురం సర్‌ప్లస్ ఛానల్ ద్వారా కొయ్యలగూడెం, గోపాలపురం మండలాల్లోని కొన్ని గ్రామాలకు సాగునీరు అందుతోంది. అయితే చెరువును ఆక్రమించుకొని వ్యవసాయం చేస్తున్న కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే చెరువులోని రెండు ప్రధాన తలుపులలో ఒకదానిని ధ్వంసం చేయడంతో చేశారని ఆయకట్టు రైతులు తెలిపారు. దీనిపై ఇరిగేషన్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. పదేళ్ల క్రితం కూడా ఇలాగే తలుపులు ధ్వంసం చేసి చెరువులో నీరు లేకుండా ఆక్రమణదారులు చేశారని రైతులు ఫిర్యాదు చేశారు.

మామిడికి గడ్డు రోజులు



మామిడి రైతుల సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి

నూజివీడు: ప్రపంచ స్థాయిలో పేరుగాంచిన నూజివీడు మామిడికి గడ్డు పరిస్థితి ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. ప్రపంచ మామిడి దినోత్సవంను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నూజివీడు అమర్ భవన్‌లో ఏలూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు టి సోమశేఖర అధ్యక్షతన సోమవారం మామిడి రైతుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి ఉత్పత్తిలో రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో ఉందన్నారు. అయితే గత కొన్నేళ్లుగా మామిడి రైతులు నష్టాలు చవిచూడటం బాధాకరమన్నారు. మామిడి మార్కెటింగ్ వ్యవస్థను బలపరచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి మాట్లాడుతూ మామిడి రైతులు నాణ్యమైన పంటతో పాటు అధిక దిగుబడి సాధించాలంటే కొమ్మ కత్తిరింపు, అలాగే కొత్తగా మామిడి సాగు చేసేవారు అధిక సాంద్రత పద్ధతిలో మొక్కలు నాటడం మంచిదన్నారు. నీటి తడులు ఇచ్చేటప్పుడు ఎరువులు కలిపి అందిస్తే మంచిదన్నారు. అనంతరం రైతుల సందేహాలకు ఆమె సమాధానమిచ్చారు. ఈ సదస్సులో ఉద్యాన శాఖ ఏడీ రామ్మోహన్‌రావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాపంచల జమలయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు డేగ ప్రభాకర్ రావు, నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, వ్యవసాయ శాఖ ఏడీ విద్యాసాగర్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై డీఈవోకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహంకు యూటీఎఫ్ నాయకులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ జీఓ 117ను రద్దు చేసి జీఓ 55 ప్రకారం టీచర్లను కేటాయించాలని, ప్రీప్రైమరితోపాటు 1 నుంచి 5 తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని, హైస్కూళ్లలో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముస్తఫా ఆలీ, రాష్ట్ర కార్యదర్శి బీ సుభాషిని, జిల్లా కోశాధికారి జీవీ రంగమోహన్, జిల్లా ఆడిట్ కన్వీనర్ బీ. మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి ఈ. శివశంకర్‌రావు, దెందులూరు మండల ప్రధాన కార్యదర్శి ఆర్.రామకృష్ణ, ఏలూరు నగర శాఖ ప్రధాన కార్యదర్శి జొన్నకూటి. రాజారావు, జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఉపాధ్యాయులను మరిచిన ప్రభుత్వం

రాష్ట్రంలో మున్సిపల్ ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్న విషయాన్ని ప్రభుత్వం మరిచిపోయిందని ప్రోగ్రెస్సివ్ మునిసిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ సుమంత్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీల్లో ఉన్న అసంబద్ధాలను సరిచేస్తూ సీనియారిటీ కోల్పోని జిల్లా యూనిట్‌గా బదిలీలు కల్పించాలని, కోర్టు కేసు ఉన్న నేపథ్యంలో అడ్‌హక్ జిల్లా యూనిట్‌గా సర్వీసు రూల్సు విడుదల చేసి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఆయన కోరారు.

చెరువులు కావవి.. వరి పొలాలు


దువ్వ వయ్యేరు అక్విడెక్ట్ వద్ద తూడు, గుర్రపు డెక్కతో నిలిచిపోయిన వరద ప్రవాహం


ఎర్ర కాలువ వరద కారణంగా తేతలిలో నీట మునిగిన వరి పొలాలు

- ఆందోళనకరంగా వయ్యేరు వరద ఉధృతి
- రోజుల తరబడి ముంపులోనే..
- ఆశ వదిలేసుకుంటున్న అన్నదాతలు

తణుకు టౌన్ : తణుకు మండలం దువ్వ గ్రామంలో వయ్యేరు కాలువ ప్రమాదకరంగా మారింది. దువ్వ అక్విడెక్ట్ వద్ద వరద నీటి మట్టం సోమవారం కూడా అక్విడెక్ట్ అంచులను తాకుతూ వరద ప్రవహిస్తోంది. దీంతో వయ్యేరు గట్టున గుడిసెలు పూర్తిగా నీట మునిగాయి. దువ్వ వయ్యేరు ఉధృతంగా ప్రవహించడంతో దువ్వ గ్రామంలోని పల్లపు ప్రాంతాలు, వీధుల్లో వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దువ్వ గ్రామంలో వయ్యేరు అక్విడెక్ట్ వద్ద తూడు, గుర్రపు డెక్క నిలిచిపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండటంతో ఎగువన సూర్యారావు పాలెం వద్ద ఎర్ర కాలువ గట్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తుంది. దీనితో మండలంలోని దువ్వ, తేతలి గ్రామాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. దీనితో పాటు దువ్వ, సూర్యారావు పాలెం గ్రామాల మధ్య రోడ్డులో వరద నీటితో మునిగిపోవడంతో దువ్వ, సూర్యారావుపాలెం గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అలాగే దువ్వ గ్రామంలోని పలు పల్లపు ప్రాంతాల్లో గత మూడు రోజులుగా వరద నీరు నిలిచిపోయింది.


లక్ష్మీనారాయణపురంలో పంట ముంపుపై రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయశాఖ అధికారి రాజేష్

కొనసాగుతున్న వైద్య శిబిరాలు..

దువ్వ గ్రామంలో వరద కారణంగా అంటు వ్యాధులు ప్రబలకుండా వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన వైద్యశిబిరాలు సోమవారం కూడా కొనసాగాయి. వరదల నేపథ్యంలో దువ్వ గ్రామంలో మూడు చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటుచేశారు. ఈశిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కిషోర్, ఇతర వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తున్నారు.

మండలంలో 3 వేల ఎకరాలలో వరినాట్లు మునక

అత్తిలి: ఇటీవల ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు అత్తిలి మండలంలో 3వేల ఎకరాలలో వరి నాట్లు ముంపులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. సోమవారం ఆయన అత్తిలి మండలం ఉనికిలి, లక్ష్మీనారాయణ పురం గ్రామాలలో పర్యటించి నీట మునిగిన వరిచేలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరినాట్లతోపాటు 120 ఎకరాలలో నారుమడులు ముంపుబారిన పడ్డాయన్నారు. నీట మునిగిన 5 రోజుల లోపు వరి నారుమడి నుంచి నీటిని పూర్తిగా బయటకు తీసి, 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, కిలో ఎంటీపీ వేసుకోవడం వల్ల కొత్త ఆకు వచ్చి నాట్లు వేయడానికి అందివస్తుందన్నారు. మొక్క నిలదొక్కుకున్న అనంతరం 1 గ్రాము కార్బెండిజమ్ లేదా 2 గ్రాములు కార్బెండిజమ్ మాంకొజెబ్ మిశ్రమాన్ని పై పాటుగా పిచికారి చేస్తే తెగుళ్ల బెడద తగ్గుతుందన్నారు. గ్రామ సర్పంచ్ పి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఆడారి శ్రీనివాసరావు, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, గోపీకృష్ణ, వీఏఏ శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

తగ్గని యనమదుర్రు డ్రెయిన్ ఉధృతి


అత్తిలి మండలం ఆరదలకోడు అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద వరద ఉధృతి

అత్తిలి: యనమదుర్రు డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు చేరడంతో గత నాలుగు రోజులుగా యనమదుర్రు డ్రెయిన్‌లో నీటి ప్రవాహం గట్లను తాకుతూ ప్రవహిస్తోంది. ఫలితంగా అత్తిలి మండలం తిరుపతిపురం, వరిఘేడు, కొమ్మర, ఈడూరు, ఉనికిలి, లక్ష్మీనారాయణపురం, స్కిన్నెరపురం, మంచిలి, దంతుపల్లి ఆయకట్టు ప్రాంతం ముంపులోనే ఉంది. ఆరుదలకోడు అవుట్‌పాల్ స్లూయిజ్ నుంచి యనమదుర్రు డ్రెయిన్ వరదనీరు ఎగదన్నడంతో వేలాది ఎకరాలలో వరి పంటముంపు బారిన పడింది. యనమదుర్రు డ్రెయిన్ ఉధృతి తగ్గితేకానీ చేలల్లో ఉన్ననీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. గత నాలుగు రోజులుగా పంటచేలు ముంపులో ఉండటంతో నాట్లు పాడైపోతాయని, నారుమళ్లు కుళ్లిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

బ్యాంకింగ్ చట్ట సవరణలు బడ్జెట్లో చేయరాదు



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ యూనియన్ ఉద్యోగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణకు వీలు కలిగించే బ్యాంకింగ్ చట్ట సవరణలు చేయరాదని బ్యాంకు యూనియన్ నాయకులు కోరారు. రానున్న బడ్జెట్‌లో అటువంటి సవరణలు ప్రతిపాదించకూడదని ఏఐబీఈఏ జాతీయ సమితి సభ్యుడు టీవీ సూర్యనారాయణ, బీఓఐ స్టాఫ్ యూనియన్ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎస్.ఎస్.ప్రసాద్‌లు కేంద్రాన్ని కోరారు. పట్టణంలో సోమవారం వారు మాట్లాడుతూ దేశ సంపదను, జాతీయ బ్యాంకింగ్ పరిశ్రమ దేశ సమగ్ర ఆర్థిక, అభివృద్ధి కొరకు చేసిన సేవలను దృష్టిలో ఉంచుకుని పీఎస్‌యూ బ్యాంకుల పరిపుష్టి కోసం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రపంచంలో ఎక్కడా లేనంత అభివృద్ధి జాతీయ బ్యాంకులవల్ల కలిగిందని, వాటిని కార్పొరేట్ శక్తుల చేతులలో పెట్టడం సరికాదన్నారు.

దాశరథి ఆశయ సాధనకు కృషి చేయాలి

తణుకు టౌన్: దాశరథి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తణుకు ఎంఈవో డీ మురళీ సత్యనారాయణ చెప్పారు. సోమవారం దాశరథి శతజయంతి సందర్భంగా సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో తణుకు మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ దాశరథి అక్షర చైతన్యానికి వారధి అని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం హరిబాబు, ఎం మహాలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తా


రైతులతో మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.గంగరాజు

పెనుమంట్ర: మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రులో వరద ముంపు ప్రాంతాలలో సోమవారం కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు పర్యటించారు. రైతులను ముంపు సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోస్తనీ ఆక్రమణల తొలగింపు పనులు సక్రమంగా జరగలేదని, నాట్లు, పంట సమయంలో ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వివరించారు. ఈ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి పులపర్తి నాగరాజు, శరకడం శ్రీనివాస్, మారుతీ కృష్ణ, కర్రి సూర్రెడ్డి, కర్రి బ్రహ్మానందరెడ్డి, కర్రి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కనీస వసతుల కోసం వినతి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని, వర్షపు ముంపు నీటిని బయటకు తోడించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలోబాధితులు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ కాలనీలో తిష్ట వేసిన సమస్యలు పరిష్కరించాలన్నారు. రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమిషనర్ జి.కృష్ణమోహన్‌కు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.తవిటినాయుడు, సందక సూరిబాబు, గేదల ధనుష్, బొడ్డుపల్లి రాంబాబు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

భీమవరం: పట్టణంలో వసుధ ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం వెంకటేశ్వర బధిరుల పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు మాట్లాడుతూ బధిర విద్యార్థులు విద్యాసామర్థ్యాలు ఎక్కువగా కలిగి ఉంటారని, వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, బి వెంకటపతిరాజు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడవద్దు.. అండగా ఉంటా


కొండేపాడులో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేఎస్ఎన్


రావిపాడు సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబును పరామర్శించి ఓదార్చుతున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: కార్యకర్తలకు, నాయకులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన తుఫానువల్ల నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రమాదానికి గురై ఇంటివద్ద విశ్రాంతి తీసుకొంటున్న రావిపాడుకు చెందిన మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబును, పార్టీ బీసీ సంఘ నాయకులు మీనవిల్లూరుకు చెందిన చింతపల్లి శ్రీనివాస్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో ఆయనతో పాటు, ఇబ్బందులలో ఉన్న పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. ప్రజలకు సేవ చేసేందుకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో ఎవరైనా సమస్యలతో ఇబ్బందులు పడితే కార్యకర్తలు తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, గుండుమోగుల సాంబయ్య, వైఎస్సార్ సీపీ బీసీ సంఘ నాయకులు చింతపల్లి శ్రీనివాస్, వాకా వెంకటసుబ్బారావు, గోడే శ్రీనివాస్, బండారు రాంబాబు, మర్రే కృష్ణమూర్తి, దేవ వెంకటరమణ, పెన్నాడ రాఘవ, చల్లా లింగమూర్తి, కుమారస్వామి, మిరియాల శేషు, ఉండ్రావరపు రాజు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవరశెట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల నుంచి మురుగునీరు సరఫరా


కుళాయిల ద్వారా వచ్చిన మురుగునీరు

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని 11వ వార్డులో గత వారం రోజుల నుంచి మంచినీటి కుళాయిల ద్వారా మురుగునీరు సరఫరా అవుతోంది. దీంతో స్థానికులు మురుగునీరు సరఫరా కావడంతో ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో తుఫాను ప్రభావంతో నిరంతరాయంగా వర్షాలు కురవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుళాయిలను పరిశీలించి మంచినీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయంపై మున్సిపల్ కమిషనర్ డి మురళీకృష్ణ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో మురుగునీరు సరఫరా అవుతుందని ఇటీవలే తమకు సమాచారం వచ్చిందన్నారు. మురుగునీరు వస్తున్న ప్రాంతాలను పరిశీలించి మరమ్మతులు చేపట్టి మంచినీరు సరఫరా చేస్తామన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక క్యాంపులు

తాడేపల్లిగూడెం: ప్రజలు ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఈనెల 23 నుంచి 27 వరకు ప్రత్యేక మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు, పాఠశాలలు, కాలేజీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి పెండింగ్‌లో ఉన్న ఆధార్ సర్వీసులను అప్‌డేట్ చేస్తామన్నారు. ఆధార్ ఎన్‌రోలెమెంట్, డాక్యుమెంట్, బయోమెట్రిక్ అప్‌డేట్‌లను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామన్నారు. పట్టణంలో 2, 11, 15, 18, 23 సచివాలయాల్లో వీటిని ఏర్పాటు చేశామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎర్ర కాలువకు రెండు గండ్లు


గండిని పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీకృష్ణ


ఆరుళ్ల - కోనాల రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

తాడేపల్లిగూడెం రూరల్: వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా తాడేపల్లిగూడెం మండలం నందమూరు – ఆరుళ్ల, ఆరుళ్ల – కోనాల మధ్యలో ఎర్ర కాలువకు రెండు గండ్లు పడ్డాయి. దీంతో ఎర్రకాలువ నీరు నంద మూరు మీదుగా ఆరుళ్ల చేలలోకి, అక్కడ నుంచి గ్రామం మీదుగా కోనాల సమీపంలోని గొడిచర్ల బ్రిడ్జి వద్ద వయ్యేరు కాలువలోకి ప్రవేశిస్తోంది. ఈ నేపథ్యంలో ఆరుళ్ల గ్రామానికి సంబంధించి 1300 ఎకరాల్లో ఎర్ర కాలువ వరద నీరు తిష్ట వేసింది. అలాగే వీరంపాలెం, పట్టింపాలెం, అప్పారావుపేట, మాధవరం, జగన్నాథపురం, దండగర్ర, నవాబుపాలెం, ఆరుళ్ల, నందమూరు, మారంపల్లి, ఆరు గొలను, కొత్తూరు, చిన తాడేపల్లి, మోదుగ గుంట, ఉప్పరగూడెం, మెట్టఉప్పరగూడెం గ్రామాల్లో 10,700 ఎకరాలు ఎర్ర కాలువ వరద నీటిలోనే కొనసాగుతుంది. ఆరుళ్లలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో వరద బాధితులకు భోజన ఏర్పాట్లు చేశారు. కోనాల సమీపంలో ఏర్పడిన గండిని పరిశీలించేందుకు తాడేపల్లిగూడెం తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ పరిశీలించారు. వారి వెంట ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఏవో ఆర్ఎస్.ప్రసాద్, వీఆర్వో కే.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు తదితరులు ఉన్నారు.

నేడు లయన్స్ క్లబ్ సమావేశం

ఉండి: నూతనంగా ఏర్పడిన లయన్స్ క్లబ్ సమావేశాన్ని ఉండి కూనపరాజు అప్పలరాజు, సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు తెలిపారు.

అప్రమత్తతే ఆయుధం

- వాతావరణ మార్పులతో విజృంభిస్తున్న వ్యాధులు
- అప్రమత్తమైన అధికారులు
- వ్యాధుల వ్యాప్తికి ఆదిలోనే అడ్డుకట్ట
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


పెంటపాడు పీహెచ్‌సీలో వ్యాధులనివారణపై ఆశాలతో సమావేశాలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పెంటపాడు : రుతుపవనాలు ద్రోణి ప్రభావంతో నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వ్యాధులు విజృంభించే అవకాశాలు ఉన్న ప్రాంతాలను గుర్తించడంతో పాటు వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా వ్యాధులకు కారణమయ్యే దోమలు, క్రిమికీటకాలను ఆదిలోనే నిర్మూలించేలా చర్యలు చేపట్టారు.

గ్రామాల్లో ప్రత్యేక చర్యలు

దోమలు, ఈగలు, మట్టిమలినాలు, అపరిశుభ్ర వాతావరణం, చేతులు శుభ్రం చేయకపోవడం,నీరు కలుషితం వంటి వాటివల్ల వ్యాధులు విజృంభించే అవకాశాలున్న విషయాన్ని ప్రజలకు వివరించడమే వాష్‌ప్రోగ్రాం లక్ష్యం. దీనిలోభాగంగా గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే చేస్తున్నారు. అంతేకాకుండా హెక్టార్ బోర్న్, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు కలగజేసే దోమల నివారణ కు చర్యలు తీసుకోవడం, శానిటేషన్, తాగునీరు, శుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం అంటువ్యాధులకు కారణమయ్యే కుళ్లిన, నిల్వఉన్న ఆహార పదార్థాలు తినకుండా ప్రజలను అప్రమత్తం చేయడం చేతులను శుభ్రం చేసుకొనే విధానాలను ప్రజలకు వివరించడంవంటి చర్యలు తీసుకోవడం, గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి దోమలు గుడ్లు పెట్టే అవకాశాలున్న పరిసరాలను గుర్తించి దోమలను లార్వా దశలోనే నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతోపాటు ప్రజలకు సూచనలు ఇస్తున్నారు.


అడిషనల్ డీఎంహెచ్‌వో ముదునూరు పీహెచ్‌సీలో సందర్శించి వివరాలు తెలుసుకొంటున్న దృశ్యం (ఫైల్)

గ్రామాల బాట పట్టిన వైద్య సిబ్బంది

వైద్యారోగ్య శాఖాధికారులు గ్రామాల బాట పట్టా రు. బృందాలుగా విడిపోయి పల్లెల్లో పర్యటిస్తున్నారు. గృహాలను సందర్శించి రోగాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నారు.ఇళ్ల వద్ద దోమలు నిల్వ ఉండే పరిసరాలు, గోతులు,ఖాళీ డబ్బాలు, డ్రెయిన్లు వంటి వాటిని పరిశీలించి దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారి చేస్తున్నారు. దోమ తెరలు, దోమ చక్రాల ద్వారా దోమల నుంచి రక్షణ పొందవచ్చని సూచిస్తున్నారు. అయినా ప్రతి వైద్య కేంద్రాల్లో రోగుల రద్దీ తగ్గడం లేదు. పెంటపాడు, ముదునూరు, వెంకటరామన్నగూడెం, మాధవరం, పీహెచ్‌సీలతో పాటు, గూడెం ఏరియా ఆసుపత్రి, దానికి అనుబంధంగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లతో సహా ప్రేవేటు మెడికల్ ప్రాక్టిషనర్ల వద్ద ఓపీ సేవలు భారీగా పెరిగినట్లు వైద్యసిబ్బంది చెబుతున్నారు.

ముందు జాగ్రత్త చర్యలతో నివారణ



పెంటపాడు మండల పరిధిలోని గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులను కట్టడి చేయగలుగుతున్నాం. ఎక్కడ దోమలు వ్యాప్తి చెందుతాయో గుర్తించి వాటి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ప్రతి ఆశ కార్యకర్త తమ పరిధిలో ప్రతి రోజూ 30కుటుంబాలను సందర్శించి వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించాం. జ్వరం, దగ్గు, జలుబు, లక్షణాలతో వచ్చే రోగులకు వేగంగా వైద్యసేవలు అందిస్తున్నాం. ఈ లక్షణాలతో వచ్చే ప్రతి రోగి రక్త పరీక్షలు, కఫం పరీక్షలు చేయిస్తున్నాం. అవసరమైతే సిలైన్ పెట్టి ఆస్పత్రిలో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నాం. రోగాల భారిన పడకుండా ఉండేందుకు వ్యక్తిగత శుభ్రత పాటించాలని రోగులకు సూచిస్తున్నాం.

– డాక్టర్ పూజిత, పీహెచ్‌సీ, ముదునూరు